# వంచకులు

నూరు రూపాయలు!

నూరు రూపాయల నోటు!.... కళ్ళు జిగేలుమన్నాయి శర్మకి ఒక్కసారిగా, కళ్ళు నులుముకుని మరోసారి చూశాడు సందేహం తీరక. నిజంగా, నిస్సందేహంగా వందరూపాయల నోటు ఎదురుగా పడుంది. శర్మ గుండెలు గబగబ కొట్టుకున్నాయి. చుట్టూ ఓసారి చూశాడు, కనుచూపు మేరలో తనని ఎవరూ గుర్తించడం లేదని రూఢీ చేసుకుని వంగి, వణుకుతున్న చేతుల్తో ఆ నోటు తీసి గబాలున జేబులో వేసుకున్నాడు. రుమాలు తీసి మొహాన్ని పట్టిన చెమట తుడుచుకుంటూ దగ్గిరిలోనున్న సిమెంట్ బెంచీమీద చతికిలబడ్డాడు.

పార్కునిండా అప్పుడే సంజ చీకట్లు అలుముకుంటున్నాయి. రేడియో దూరంగా గ్రామస్తుల కార్యక్రమం వినిపిస్తూంది.

“తనెంత అదృష్టవంతుడు!.... ప్రొద్దుటే ఎవరిమొహం చూసి లేచాడో గాని!.... యింకెవరూ? ... ఆ ఏడుకొండలవాడి మొహమే! రోజులాగే ఆ వెంకటరమణమూర్తి ఫొటోకి దండంపెట్టే కళ్ళు తెరిచాడు ....తన కష్టాలు చూడలేక.... తన మొర ఆలకించి స్వయంగా ఆ ఏడుకొండలవాడే తన కోసం యీ డబ్బు యిక్కడ పడవేసి వుంటాడు!”

జేబులోంచి నోటు తీసి తృప్తిగా చూసుకుని మళ్ళీ జేబులో పడేసుకున్నాడు శర్మ.

“ఏది ఎలావున్నా.... తక్కినవన్నీ అలా వుంచి ముందు అనసూయని వైజాగు హెడ్డాస్పత్రికి తీసుకెళ్ళాలి! అనసూయ బాధ చూడలేకుండా వున్నాడు తను.

శర్మ మనసు శరవేగంతో ప్లానులు వేయసాగింది వందరూపాయల ఆసరాతో।

"వెంటనే శెలవుపెట్టి అనసూయని తీసికెళ్ళి ఆపరేషన్ చేయించాలి. యింకా ఉపేక్షించకూడదు। డాక్టరు అప్పుడే గట్టిగా హెచ్చరించి మూడు నెల లయింది? అనసూయ బాధతో గిలగిలలాడి పోతూంది.

"అదేం మాయదారి రోగమో అనసూయని పట్టుకుని పీల్చి పిప్పి చేస్తూంది. తాము గుర్తించ లేక పోయారుగాని నాలుగో కానుపు నించీ ప్రవేశించిందట. ఐదో కానుపులో బయటపడింది।

"హ।.... తన బ్రతుక్కి ఐదుగురు పిల్లలు। అందులో ఐదుగురు ఆడపిల్లలు ఈసారి కొడుకు. కొడుకు పుడతాడనుకుంటూనే ఐదుగురు ఆడపిల్లల్ని కన్నాడు. తనలాంటి కాస్తో కూస్తో చదువుకున్నవారే కుటుంబ నియంత్రణాన్ని యిలా ఉపేక్షిస్తూంటే ఈ దేశం బాగుపడమంటే ఎలా బాగుపడుతుంది.

తనూ ముచ్చటగా ఇద్దరు పిల్లల్ని కని, వచ్చే సంపాదనతో పరిమిత కుటుంబంతో పొదుపుగా చీకూ, చింతా లేకుండా జీవించాలని అనుకున్నాడు. కానీ అనుకున్నవి అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే యింకేం కావాలి?

కొడుకు కావాలన్న వ్యామోహాన్ని వదులుకోలేక ఐదుగురు ఆడ పిల్లల తండ్రి అయ్యేడు। నాలుగో కానుపునించే అనసూయ ఆరోగ్యం క్షీణించి అతి నీర్సంతో అతి అయాసంతో బాధపడేది. డాక్టరమ్మ అప్పుడే చివాట్లు పెట్టింది। "మీకు పెళ్ళాం ఆరోగ్యం ముఖ్యమా?.... మగపిల్లవాడు ముఖ్యమా? ఏడేళ్ళలో నాలుగు కానుపులా? ఆరోగ్య విషయం మీలాంటి కాస్తోకూస్తో చదువుకున్నవారే నిర్లక్ష్యంచేస్తే ఎలా? అని చివాట్లు పెట్టి యిక ముందైనా జాగ్రత్తగా వుండమంది. బలమైన మందులు తీసుకోవా లంది. కాని వచ్చేజీతం, అప్పులు చెయ్యకుండా తిండికే గడవక ఇబ్బందిగా వుంటే బలమైన ఆహారాలు, మందులు తనేం యిప్పిస్తాడు।

ఫలితం అనూయ ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణించిపోసాగింది. కానుపులు దగ్గరవడంచేత, చాకిరి, గర్భిణి అవడం నించి అలా వుందని తను అప్పుడు అంత పట్టించుకోలేదు. పట్టించుకుని మాత్రం ఏం చెయ్య గలడు ?

నాలుగో కానుపూ ఆడపిల్ల అయినా, ఇంకా ఆశ చావని ఫలితమే ఐదో ఆడపిల్ల. డాక్టరమ్మ ఈసారి తనని కేకలు వేయలేదు గాని, పురుగుని చూసినట్టు తృణీకరంగా చూసి, తన ఇష్టా యిష్టాల ప్రమేయం లేకుండా, ఓ కాగితం మీద సంతకం చేయించుకుని అనసూయకే ఆపరేషన్ చేసింది పిల్లలు పుట్టకుండా.

అప్పటినించి అనసూయ పరిస్థితి మరింత అధ్వాన్నంగా అయింది. రోజూ సన్నగా జ్వరం తగ్గినట్లుండడం, మనిషి నీరసించిపోవడం, రొమ్ము సలుపు పోట్లతో పసిపిల్లకి పాలుకూడా ఈయలేకపోయేది. డాక్టర్లు పరీక్షచేసి స్పెషలిస్టులచేత పరీక్షలు చేయించమన్నారు. పరీక్షలు చేసి— ఎక్సరేలు తీసి "బ్రెస్ట్‌కేన్సర్" అని తేల్చి కేసు చాల ముదిరిందని, యిన్నాళ్ళు తమ నిర్లక్ష్యానికి చివాట్లు పెట్టారు ! వెంటనే ఆపరేషన్ చేయించకపోతే లంగ్స్‌కే దెబ్బ. ప్రాణానికి ముప్పు అన్నారు.

తన గుండెల్లో రాయి పడింది. కేన్సర్. ఆపరేషన్ ! డబ్బు.... ఎక్కడినించి తేవడం డబ్బు !

కరువురోజుల్లో, తన గుమస్తా జీతంతో తెల్లవారితే మొదలు పాలకి అరువు, పెరుక్కి అరువు, దుకాణంలో అరువు, అడితెల్లో అరువు, మార్వాడీ అప్పులు.... అన్నింటికి అరువే ! అప్పుల బ్రతుకుతో తను ఆ వూర్లో అనసూయ ఆపరేషన్‌కోసం రెండొందలయినా పుట్టించ లేకపోయాడు. మూడు నెలలుగా ఎంత గవర్నమెంటు ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం చేసినా ప్రయాణపు ఖర్చులు తనకి అక్కడ వుండడానికి ఖర్చయినా కావాలికదా, అదే పుట్టించడం గగనమైంది. గట్టిగా అమ్మదామంటే పదిరూపాయల విలువగల వస్తువైనా యింట్లో లేని తనకి అప్పులవాళ్లు ఏం చూసి ఇస్తారు అప్పు? ఎన్నాళ్ళు ఇస్తారు? పుచ్చు

కున్నవి తీర్చండే యిమ్మంటే యివ్వనివాళ్ళదా తప్పు! ఇంట్లో అమ్మ దగ్గిరవన్నీ ఏనాడో బైటికి నడిచాయి. ఇంక ఇంట్లో అస్థిపంజరాల్లాంటి మనుష్యులు మాత్రం మిగిలారు!

తన అవస్థ అంతా చూస్తూ నిస్సహాయంగా కంటనీరు పెట్టు కుంటుంది అనసూయ. ఎందుకొచ్చిన బాధ! ఎందుకు అనవసరంగా బాధపడతారు నాకోసం! ఈ రోగం తగ్గదు ఎలాగు! అనవసరంగా వృధా ప్రయాసపడకండి! అంతకంటె నాకింత విషమిచ్చి నన్నీ బాధ నుండి విముక్తురాలిని చేయండి .... యీ బాధ భరించలేనింక! ...." అంటూ భోరున ఏడుస్తుంది! తనూ ఆమెతో పాటు ఏడవటం మినహా ఏం చెయ్యగలడు? భూలాల్లా పోట్లు పొడుస్తూంటే, ఆ బాధ పడలేక అనసూయ పడేబాధ చూడలేకే అసలు సాధ్యమైనంత వరకు ఇంటి పట్టున వుండడం మానుకున్నాడు.

యిదంతా ఒక ఎత్తు! అనసూయ మంచాన పడిందగ్గిరనించి, లేవ లేనిస్థితికి వచ్చిన దగ్గరనించి .... ఆఫీసుపని, యింటిపని, పసిపిల్లల సంరక్షణ అన్నీ కలిపి తన సహనాన్ని, ఓర్మిని పరీక్షిస్తునాయి. అసహాయత్వంలో కోపంకాక మరేం వస్తుంది. ఆ కోపానికి గురి అయ్యేది పిల్లలు! ఈ మాయదారి రోగం నీకుకాక నాకు వచ్చినా హాయిగా వుండేవాడిని. ఈ తిప్పలన్నీ నాకు తప్పేవి! .... నీ రోగం నాచావుకే వచ్చినట్టుంది .... ఛీ .... వెధవబ్రతుకు! నా వల్లగాదింక .... ముందు మీకింత విషంపెట్టి తరువాత నేనూ చస్తాను. అక్కడితో శని వదులు తుంది మనకు! కనపడ్డ నిర్జీవ, సజీవ ప్రాణాలమీద తన కోసం తీర్చు కుంటాడు. అనసూయ విషాదంగా నవ్వుకుంది .... "ఆ పనేదో త్వరగా చేసి పుణ్యం కట్టుకోండి! .... మీకూ మాకూ కూడా ఎంతో హాయి!" అని ఏడ్చేపిల్లల్ని దగ్గిరకి తీసుకుని కళ్ళు వత్తుకుంటుంది తను విసవిస యింట్లోంచి వెళ్ళిపోతూంటే.

ఏదో యింత ఉడకేసి పడేయడానికైనా ఏ పెద్ద దిక్కునయినా తెచ్చిపెట్టుకుందామన్నా ఇటు, అటు పెద్దలు అంతా ఎప్పుడో వేం చేశారు.

ఆ వున్న ఒక్క అక్కగారూ ఆ మధ్యవచ్చి తన సంతానంతో సహా ఒకనెల వుండేసరికి, ఆమె సాయంకంటె, అంత మందిని భరించడం కంటె చాకిరీ చేసుకోవడమే నయమనిపించి, మళ్ళీ రమ్మని రాయలేదు. అయినా ఎవరువచ్చి ఎన్నాళ్ళుంటారు.

ఏదో యింత ఉడకేసి పడేసి, ఆఫీసు వంకతో వీలయినంత సైముపైనే గడుపుతున్నాడు ఇంట్లో బాధలు పడలేక. పడుతూ, లేస్తూ అనసూయే పాపం పిల్లల పని చూసుకుంటుంది.

రోజుకోసారయినా బాధతో గిలగిలలాడుతూ యింత విషం తెచ్చి పెట్టమని ప్రాధేయపడుతుంది అనసూయ,

కట్టుకున్న భార్య. తన పిల్లల తల్లి. ఆమెని రక్షించుకోవడం తన విధి. ఏం ఏమయినా, రేపే శెలవుపెట్టి, పిల్లల్ని అక్కగారి దగ్గర వదిలి, ముందు వైజాగ్‌లో జాయిన్ చేయాలి అనసూయని ధృఢంగా ఆలోచించి నిశ్చయించు కున్నాడు శర్మ.

ఈ నూరు రూపాయలు నిజంగా దేముడే పంపినట్టు తనకి సమయానికి ఆదుకున్నాయి.

ఆలోచన మధ్యలో చటుక్కున గుర్తువచ్చింది తనకి. "యీ డబ్బు పోగొట్టుకున్న వాడెవడో తనలాంటి అభాగ్యుడు కాదుకదా!" అన్న ఆలోచనరాగానే ఒక్కక్షణం గుండెలు బిగపట్టాయి! అంతలోనే తేలిగ్గా నవ్వుకున్నాడు. తనలాంటి అభాగ్యుల దగ్గర నూరు రూపాయల నోటు మొదటితారీకు జీతం తీసుకున్న కొద్ది గంటలు తప్ప, ఎప్పుడు వుంటుంది. నెలాఖరున నూరు రూపాయలు వున్నవాడు అభాగ్యుడు ఎలా అవుతాడు? ఎవరో డబ్బుతో మదం ఎక్కవున్నవాళ్ళు, పోయినా ఖాతరు లేని వాళ్ళెవరో, విలాసంగా కిక్కిరిసిన పర్సులోంచి ఏ ఐస్‌క్రీమో, వేరుశనక్కాయలో నమలడానికి కొనుక్కుంటూ డబ్బుతీసినపుడు జారి పడి వుంటుంది! అసలీ నోటుపోయినట్టేనా తెలిసివుండదు వాళ్ళకి!

అందుకే ఎవరూ వెతుక్కోడానికైనా రాలేదు.... అంతే !... అదే అయింటుంది ! తృప్తిగా నిట్టూర్చాడు శర్మ.

* * *

"ఎంత దౌర్భాగ్యుడు తను ! తనలాంటి దురదృష్టవంతులు ఎవరైనా వుంటారా?.... ఎంత కష్టపడ్డాడు ఆ డబ్బు కోసం !.... ఎంత గొడవపడ్డాడు ఆ డబ్బుకోసం ! ఎన్నాళ్ళు తిరిగాడు ఆ డబ్బు కోసం !.... ఆ డబ్బూ పోగొట్టుకున్న తను ఎంత అభాగ్యుడు !" ఆవేదనగా కళ్ళనీళ్ళ పర్యంతరం అయింది సుబ్బారావుకి.

రేపొద్దున తమ్ముడు పరీక్ష ప్యాసయి ఏదో ఉద్ధరిస్తాడన్న ఆశ సుబ్బారావుకి. ఉద్ధరించకపోయినా ఏదో ఓ ఉద్యోగంచేసి కాస్త వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా సాయం చేస్తాడని భ్రమ ! రేపే ఫైనుతో పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖరి రోజు ! పదిహేను రోజులుగా తిరగని చోటులేదు. అడగని వాడులేడు ! ఎవడిస్తాడు అప్పు.... అప్పుమాత్రం ఏం చూసి ఎన్నాళ్ళిస్తారు?.. నెలాఖరున ఏభై రూపాయలు ఎక్కడనించి మొలిపిస్తాడు. అతని గుమస్తాజీతం.... ఉదయం ఆఫీసు టైమువరకు ట్యూషన్స్ సంపాదన. సాయంత్రం ఆఫీసునించి వచ్చి కోమటి పద్దులు రాసి సంపాదించిన సంపాదన, చెల్లెలు ఇరుగు పొరుగువాళ్ళ బట్టలు కుట్టి ఆర్జించిన డబ్బు, అక్క పదిమంది చిన్నపిల్లలకి చదువుచెప్పి తెచ్చిన డబ్బు.... ఈ సంపాదనంతా యింట్లో రెండుపూటలా తిండి తినడానికికూడా సరిగా సరిపోవడంలేదు !

హుం.... ఎలా సరిపోతుంది. ఇంట్లోవున్న వాళ్ళు రెండు డజన్ల మంది. ఉబ్బసరోగంతో మంచంలో తీసుకుంటూ "ఇప్పించే తెలుగు మందులు పనికిరావు. ఇంగ్లీషు మందులు, ఇంజక్షన్లు కావాలని ప్రాణాలుతోడే తండ్రి !...." ఉదయం లేచిన దగ్గరనించి కర్రలులేవు, బియ్యం లేవు. నూనెలేదు, వంటెలా వండి చావను" అని శాపనార్థాలు పెట్టే తల్లి ! ఫీజులు, పుస్తకాలు అని ప్రాణాలు కొరికే తమ్ముడు ! అన్న

అవస్థచూస్తూ ఎవడితోనన్నా లేచన్నా పోవడం చాతకాని పెళ్ళికెదిగి గుండెలమీద కూర్చున్న చెల్లెలు! పెళ్ళి చేయడం తప్పనట్టు ఏడాదేడాది పురిటికి పుట్టింటికి వేంచేసి మర్యాదలు పెట్టుపోతలు చాలలేదని గునిసే పెద్ద చెల్లెలు! ఈ వున్నవాళ్ళు చాలరన్నట్టు పెళ్ళిచేసి పంపిన నాలుగేళ్ళకి, ఇద్దరు పిల్లల్ని వెంటబెట్టుకుని తలచెడి వచ్చిన అక్కగారు! "పాడు సంసారం. ఓ ముద్దా ముచ్చటా? ఏ పాపం చేసుకుని ఈ కొంపలో పడ్డానో, పెళ్ళి అయ్యాక ఓ నాడన్నా సుఖపడి చచ్చానా అంటూ నిద్రపోయే టైములో నన్నా కాస్త విశ్రాంతిగా పడుకోనీయకుండా పుండు సలిపినట్లు సలిపే భార్య! ఎదురింటి ఇంజినీరు, ప్రక్కింటి డాక్టరుగారి పిల్లలతో వంతుకి పోతూ బొమ్మలు, బిస్కట్లు, గుడ్డలు కావాలని గొంతెమ్మ కోరికలతో పేచీలతో ప్రాణాలు కొరికే యిద్దరు పిల్లలు! యింతమందిని పోషించాల్సిన తన పరిస్థితి చూచుకుంటే తనకే జాలి కలుగుతుంది సుబ్బారావుకి.

ఎంతో పాపం చేసుకుంటే కాని మధ్యతరగతి సంసారంలో పెద్ద కొడుకయి పుట్టడని సుబ్బారావు ఉద్దేశం! ఏ పాపం చేసుకోకపోతే పట్టుమని ముప్పై ఏళ్ళకే బ్రతుకుమీద విరక్తి కలిగేటంత నిరుత్సాహం వస్తుంది! నిరుత్సాహం ఏమిటి తనకున్న స్థితికి యింకా తనకెందుకు పిచ్చిఎక్కలేదా అని ఆశ్చర్యపోతాడు సుబ్బారావు అప్పుడప్పుడు. ఊరినిండా అప్పులు. అన్ని కొట్లనిండా ఖాతాలు! ఈ అప్పులన్నీ తను బ్రతికుండగా తీర్చగలడో లేదో.... లేక కొడుక్కి వారసత్వంగా యిస్తాడో సుబ్బారావుకే తెలియదు. లేచింది మొదలు తిండి అన్వేషణకే సరిపోతూంది కాలం!

తమ్ముడు ఫీజుకోసం అడిగిన చోటల్లా వాళ్ళు పెట్టిన శాపనార్ధాలు విని మెదడు, చెవులు కూడా మొద్దుబారిపోయాయి! అరువులిచ్చే వాళ్ళేనా అంత వెర్రివాళ్ళు! అవి తీరేవి కావన్న సందేహం సుబ్బారావుకే కాక వాళ్ళకి పట్టుకోడం చేత ఆ వూళ్ళో ఏభై రూపాయలు పుట్టించలేక పోయాడు సుబ్బారావు పదిహేను రోజులు తిరిగి అయినా?

యింక యింట్లో అమ్మదగ్గవి పెళ్ళాం మంగళసూత్రం మినహా ఏం కనపడలేదు సుబ్బారావుకి. వాటిగురించి మాత్రం ఎంతో రాద్ధాంతం చేసింది సుబ్బారావు భార్య.

"ఒక నగ, నట్రా చేయించి పెట్టిన పాపాన పోలేదు. పుట్టింటి వారు పెట్టినవి అమ్ముకు తిన్నారు. ఆఖరికి ఈ మంగళసూత్రం కూడా పట్టుకు పోతారా? మీ చేత్తో కట్టినది మీరే తెంపుకు పోతారా?.... చస్తే ఈయను నేను? ఎందుకీయాలి" అంటూ పెద్దగా ఏడుస్తూ అరిచింది. కోడలినిచూసి బుగ్గలు నొక్కుకుంది అత్తగారు. అదేం చోద్యమే అమ్మా! అవసరం వస్తే అమ్ముకోరూ. పసుపుకొమ్ము కట్టుకుని .... నేను కట్టుకోలేదూ, దానికోసం వాడు బ్రతికుండగానే చచ్చినట్టు రాగాలెడుతున్నావు. అంటూ దీర్ఘాలు తీసింది. దాంతో మరింత ఉగ్రరూపం దాల్చింది సుబ్బారావు భార్య. "మీరు కట్టుకున్నారంటే మీ మొగుడి రోగంకోసమో, మీ కొడుకు చదువుకోసమో అయుంటుంది. ఇది నా మొగుడి జబ్బు కాదు, నా కొడుకు చదువుకీ కాదు. నే నెందుకీయాలి .. మీరు మనుష్యులు కారు. రాక్షసులు. ఆయన రక్తమాంసాలు జలగల్లా పీల్చేస్తున్నారు మీ అందరూ కలిసి .... యింకా తృప్తిలేక నా మొగుడు బ్రతికుండగానే నా మంగళసూత్రం కూడా లాక్కుందా మనుకుంటున్నారు!" అని పెద్దగా అరుస్తూ అత్తగారిని దులిపింది. "వీళ్ళందరి కోసం మీ చీమూ నెత్తురు ధారపోస్తున్నారు. కట్టుకున్న పెళ్ళాన్ని, కన్నబిడ్డల్ని మరిచి, యింత చేసినా రేపొద్దున మిమ్మల్ని ఆదుకునే వారెవరూ లేరు యిలాంటి మనుష్యుల కోసం. కట్టుకున్న పెళ్ళానికి ఏ ముద్దు ముచ్చటా తీర్చలేని వాళ్ళ ఎందుకు చేసుకుని నా గొంతు కెందుకోసినావు! వళ్ళుమరచి యిరుగు పొరుగు చేరేట్టు కేకలేసింది సుబ్బారావుని ఉద్దేశించి.

జవాబు చెప్పలేని అసహాయత్వంలో, పరువు మర్యాదలు పోతున్నా యన్న కోపంలో సుబ్బారావు చెళ్ళున చెంపదెబ్బ పెట్టాడు భార్యని "నోర్ముయ్ నా ప్రాణానికి ఈ వున్నవాళ్ళు చాలరని, నిన్ను కూడా కట్టు

కుని అనుభవిస్తున్నాను .... అందరూ కలిసి నా ప్రాణాలు తీస్తున్నారు. నోరుమూసుకుని పడివుండు యింట్లో !" అంటూ బలవంతంగా మంగళ సూత్రం తెంపుకుని బయట పడ్డాడు సుబ్బారావు. అవును. ఏంవున్నా లేక పోయినా .... ఏది వదులుకున్నా మానినా పరువు, మర్యాదలూ వదులుకో లేరు గదా మధ్య తరగతి వాళ్ళు.

సుబ్బారావు .... పాపం ఏం చెయ్యగలడు ? యిటు కన్న తల్లి దండ్రులు — పెద్ద కొడుకుగా తన బాధ్యతని మరిచిపోగలడా ? .... అటు పెళ్ళాం, పిల్లల్ని కాదనగలడా ? తన బాధ్యతలని పెళ్ళాం కోసం ఎలా విస్మరించగలడు ? డబ్బులేకపోయినా యింట్లో మనశ్శాంతి అయినా దక్క నీయరుకదా ఆడవాళ్ళు. ఆఫీసునించి యింటికి వచ్చేసరికి అత్తమీద కోడలు ఫిర్యాదులు, కోడలుమీద అత్త నేరాలు .... ఏడ్పులు, మొత్తు కోళ్ళు అ నరకంలో వుండలేకే సుబ్బారావు సాధ్యమైనంత వరకు యింట్లో వుండడం కూడా మానుకున్నాడు.

యివాళా పెళ్ళాం మంగళసూత్రం వచ్చినంత వరకు తెగనమ్మి, నూరు రూపాయల నోటు జేబులో వేసుకొని కాస్త విశ్రాంతి కోసం పార్కులో కూర్చున్నాడు. నిజం ఆలోచిస్తే సుబ్బారావు భార్య తప్పు మాత్రం ఏముంది? ఏ ఆడదయినా యిలాంటి పరిస్థితిలో యింత కంటె ఔదార్యం ఎలా ప్రదర్శిస్తుంది. నిజానికి పెళ్ళిచేసుకున్న తరువాత ఒక్క రోజు .... ఒక్క పూటయినా ఇద్దరూ సంతోషంగా వున్నారా ? భార్య ఏ చిన్న కోరికయినా తీర్చగలిగాడా తను ? తొందరపడి చేయి చేసుకున్నం దుకు పశ్చాత్తాప పడి యింటికి వెళ్ళడానికి బయలు దేరాడు సుబ్బారావు.

త్రోవలో ఎందుకో జేబులో చెయ్యిపెట్టి నోటు లేకపోవడంతో గుండెలు గుభేలుమని చెమటలు కక్కుతూ వెనక్కి పార్కు దగ్గరకు పరిగెత్తుకొచ్చాడు సుబ్బారావు. పార్కులో లేచేముందు రుమాలు తీశాడు జేబులోంచి. అప్పుడే పడి వుండాలి నోటు" ఎంత దురదృష్ట వంతుడు. ఎంత నిర్భాగ్యుడు కాకపోతే ఈ డబ్బు పారేసుకుంటాడు తను ! తన

మొహాన్ని శని నాట్యం చేస్తుంది!.... యింత రాద్ధాంతం జరిగింది ఈ డబ్బుకోసం!.... యింక యిది పోయినందుకు యింటికెడితే యింకెంత రాద్ధాంతాన్ని ఎదుర్కోవాలో!.... కాళ్ళు వణికాయి సుబ్బారావుకి.

అసలు ఈ డబ్బుతో మిగలబోయే డబ్బుకోసం యింట్లో ఎంత మంది కోరికలో కాచుకున్నాయి! ఇంగ్లీషు మందులు తెమ్మని తండ్రిగారి ఆర్డరు, కట్టుకోడానికి మారుచీర లేదు రెండు చవక చీరలు తెచ్చిపెట్టమని తల్లిగారి సిఫార్సు, బొమ్మలు బిస్కట్లు కావాలని పిల్లల కోరికలు.... యిందరి కోరికలు కాసుకు కూర్చున్నాయి సుబ్బారావు తెచ్చే డబ్బుకోసం! ఏవి అక్కరలేనిది, గదిలో ఏడుస్తూ పడుకున్న సుబ్బారావు పెళ్ళానికి, ఇరవై ఏళ్ళకే కోరికలని చంపుకున్న సుబ్బారావుకి, యిప్పుడు ఇంక యింటికెళ్ళాలంటేనే భయంగా అనిపించింది సుబ్బారావుకి, జరగబోయే రాద్ధాంతాన్ని తలుచుకుంటే.

తను వచ్చిన త్రోవంతా వెతుక్కుంటూ, సర్వం పోగొట్టుకున్న వాడిలా దైన్యంగావున్న మొహంతో పార్కు చేరుకున్నాడు సుబ్బారావు. ఇంకా ఆ డబ్బు దొరుకుతుందన్న ఆశ సుబ్బారావులో మిగలకపోయినా యాంత్రికంగా మినుకుమినుకు మనే ఆశతో ఆ సంజ చీకటివేళ ఆ పట్టిలో నోటుకోసం గాలించసాగాడు సుబ్బారావు వేళ్ళతో చేరే నీటిని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకుంటూ.

అప్పుడే తృప్తిగాలేచి ఇంటికి వెళ్ళబోతున్న శర్మ అతృతతో, ఆందోళనగా వెతుక్కుంటూ వచ్చిన సుబ్బారావుని చూసి బ్రేక్ వేసినట్లు ఆగిపోయాడు. అప్రయత్నంగా జేబుమీద చెయ్యి వేసుకున్నాడు. శర్మ గుండెలు గబగబ కొట్టుకున్నాయి. చూడనట్టుగా మొహం ప్రక్కకి త్రిప్పుకుని తెచ్చిపెట్టుకున్న నిబ్బరంతో కూచున్నాడు జరుగబోయేదానికి సిద్ధంగా. శర్మనిచూసి కాస్త ఆశ కలిగింది సుబ్బారావుకి. నోటు సంగతి తెలుసునేమో ననిపించింది. శర్మ కూర్చున్నచోటికి వచ్చాడు సుబ్బారావు.

"మేష్టారూ! ఇక్కడ ఎక్కడైనా ఓ వందరూపాయల కాగితం కాని మీకు కనిపించిందా?.... పోనీ ఎవరికైనా దొరికినట్టు తెలుసా? మీ రెంత సేపటినించి కూర్చున్నారు ఇక్కడ?" అడిగాడు సుబ్బారావు దైన్యంగా, చెమటలు కక్కుతున్న మొఖంతో.

"అబ్బే....అబ్బే నాకేం కనపడలేదండీ! వందరూపాయల నోటా! అసలు చూడనేలేదండీ!....నే నిప్పుడే పదినిమిషాల క్రితమే వచ్చాను ఇక్కడికి" గాభరాగా అన్నాడు శర్మ.

చూడలేదా? ప్చ! యిప్పుడే అరగంట క్రితమే ఇక్కడ పారేసుకున్నానండీ ఎవరికి దొరికిందో ఏమో! పబ్లిక్ పార్కులో, నలుగురు తిరిగేచోట ఎక్కడ వెతకను? ఎవరిని అడగను!" ఉన్న ఆశ కాస్తా పూర్తిగా అడుగంటగా నిట్టూరుస్తూ శర్మ ప్రక్కన చతికిలబడ్డాడు సుబ్బారావు.

"త్రోవలో ఎక్కడన్నా పడిందేమో!...." కాస్త నిబ్బరించుకుని మామూలుగా అడిగాడు శర్మ.

"లేదండీ! ఇంకెక్కడా పోవడానికి అవకాశం లేదు. అసలు జేబు ముట్టుకోలేదు త్రోవలో. ఇక్కడినించి బయలుదేరినపుడే రుమాలు తీశాను. దాంతోపాటు పైన పడిపోయుండచ్చు! ప్చ! ఏమయితేనేం లెండి, పోయాక!" నాలాంటి దురదృష్టవంతుడు మరెవరు వుంటారు? ఆవేదనగా అన్నాడు సుబ్బారావు.

...."ఏం, ఏదైనా అవసరంకోసం వుంచారా?...." శర్మ, సుబ్బారావు ముఖ కవళికలు చూస్తూ కాస్త బెరుకుగా అడిగాడు.

"డబ్బు అవసరంలేని దౌర్భాగ్యుడు ఎవరు ఈ రోజుల్లో! అందులో తనలాంటి అభాగ్యుడికి" నవ్వువచ్చింది సుబ్బారావుకి. పోయిన డబ్బుతోపాటు పరువు, ఆత్మగౌరవం కూడా వదులుకోలేక పోయాడు సుబ్బారావు అంత తేలికగా.

"ఆ .... అవసరమేలెండి ? .... డబ్బు అవసరం లేనిదెవరికి చెప్పండి ! ...."

"తేలిగ్గా నవ్వాడు సుబ్బారావు. శర్మ వితంగా నవ్వాడు.

"ఒక రూపాయా?".... రెండా ! పదులుకోడానికి ! .... వంద రూపాయలు. ఎంత డబ్బున్నవాడైనా వంద రూపాయలు పోగొట్టుకుని పూరుకోగలడా ? ఓ అణా చిల్లరడబ్బులు జారిపోతే వెతుకుతాం గదా.... అలాంటిది యింతసొమ్ము పోతే వెతుక్కోమా. అందులో ఎలాంటిదాని కోసం దాచినడబ్బు అది ! బింకంగా అన్నాడు సుబ్బారావు.

ఆ డబ్బు దేనికోసమో చెపితే.... మీలాంటి వారికి అత్యవసరం అనిపించదేమోలెండి ! .... కానీ .. నాకు .... దృష్టిలో అత్యవసరమైన ఖర్చు క్రిందే జమ ! .... నా తాహతుకు మించిన ఖర్చయినా .... అది అత్యవసరంగా అనిపిస్తుంది నాకు " అసహనంగా చూశాడు శర్మ.

"ఇంతకీ దేనికోసం ఆ డబ్బు ఖర్చుచేద్దామను కున్నారు ? కుతూహలంతో ప్రశ్నించాడు మధ్యలోనే శర్మ.

కొద్దిగా సిగ్గుపడుతున్నట్టు నవ్వాడు సుబ్బారావు .... యివాళ మా ఆరో వెడ్డింగ్ యానివర్సిరీ "ప్రతి సంవత్సరం ఈ రోజు మా ఆవిడకి నూరు రూపాయలుపెట్టి పట్టుచీర కొంటాను....ఆ చీర కొనడం నా తాహతుకి మించినదే అనుకోండి ! ....అంతాగా కావల్సివస్తే ఓ పూట తిండి అయినా మానేసి ఆ డబ్బు కూడపెట్టి చీర కొంటాను ...కాని మానను ! దీనికోసమని ప్రతినెలా పై ఖర్చయినాసరే తగ్గించేసి పది రూపాయలు పోస్టాఫీసులో దాస్తాను ....

ఆశ్చర్యంగా చూశాడు శర్మ ... "ఏం అలా చూస్తున్నారు ? ఆశ్చర్యంగా వుందా ? అంత కష్టపడి, అంత ఖరీదు చీర కొనకపోతేనేం ఏం అనుకుంటున్నారా ? అవును. అందరికీ అలాగే అనిపిస్తుంది ! ... కాని .... కాని మీకు తెలియదులెండి శకుంతల అందానికి, ఆమె నా కందిచ్చే ఆనందం ముందు వెధవ నూరు రూపాయలకోసం ఒకపూట ఏమిటి

రోజూ వస్తుండమన్నా వుంటాను. నా అదృష్టంకొద్ది లభించిన దేవతకి నేను ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను ?.... అలాంటిది ఏడాదికి .... ఒక సంవత్సరానికి ... ఆఫ్టరాల్ ఓ నూరు రూపాయలు ఖర్చుపెట్టద్దా ? మీరే చెప్పండి! ఏమంటారు ?

"తప్పిదారి నా లాంటి వాడిని అనుగ్రహించడానికి దివినుండి దిగి వచ్చిన దేవత శకుంతల! ఏనాటి పుణ్యమో, అలాంటి సౌందర్యవతి, అలాంటి అనుకూలవతి నాకు లభ్యమవడం !.... ఇవాళ్టికి పెళ్ళయి ఆరేళ్ళయినా యింకా ఆరురోజులనాటి అనుభూతి అందిస్తుంది రోజూ శకుంతల! అలాంటి భార్యకోసం.... వెధవది నూరు రూపాయలకంటె ఎక్కువ ఖర్చుపెట్టలేని నా అసహాయత్వం చూసుకుంటే నాకే క్రోధం వస్తుంది !... నేనే ఓ మహారాజుని అయుంటే.... నా శకుంతలని.... పట్టు పరుపుల్లో పడుకోబెట్టి బంగారు పువ్వులతో పూజించనూ రోజూ ?.... ప్చ్ !.... నూట ఏభై" రూపాయల జీతగాడిని .. యింతకంటె ఏం చేయ గలను ? ఎలా సుఖపెట్టగలను శకుంతలని !.... ఏదో చంద్రునికో నూలు పోగులా,.... ఏడాదికి ఓ సారి.... ఓ పట్టుచీర కొనీయడం తప్ప ఏం చెయ్యలేని అసమర్థుడిని !...." సుబ్బారావు కళ్ళు ఏ లోకంలోనో తేలి పోతున్నాయి. ఆ కళ్ళల్లో తళుకు, ఆ మొహంలో వెలుగు తెల్లబోతూ చూశాడు శర్మ. ఏదో పాపభీతిలాంటిది కలిగింది జేబులోనున్న నోటు తలుచుకుంటే.

"యీ సారి.... ఆ చిన్ననాటి కానుకైనా యీయలేని అభాగ్యుడిని అయిపోయాను ; బ్యాంక్‌లోంచి డబ్బు డ్రాచేసి తెచ్చాను. చీర కొందా మని కాస్త అలుపు తీర్చుకొందామని యిక్కడ కూర్చున్నాను ఓ పావు గంట !... అంతే ! ఇంటికి ఎలా వెళ్ళను ఉత్తచేతితో ! ఎలా చూపించను నా మొహం శకుంతలకి !.... ఎంత దురదృష్టవంతుడినో చూడండి !...." అతని మాటల్లోని దైన్యానికి చలించాడు శర్మ.

"పోనీ ఎవరినన్నా అడిగి తీసుకోకూడదూ...." సుబ్బారావు మొహం నల్లబడింది. "అప్పా !... అప్పెవరిస్తారు నాకు !.... అప్ర

యత్నంగా నోటివెంట వచ్చిన మాటలకి తప్పు గ్రహించి సర్దుకుంటూ కాస్త గాభరాగా .... "ఆ .... అప్పు అడగడం ఏం బావుంటుంది చెప్పండి !... అందులో అందరికి యిలాంటి సెంటిమెంట్స్ అర్థంకావు.... అప్పుచేసి పట్టుచీర కొనడం ఏమిటి అని హేళన చేస్తారు ! అంత కొనక పోతే ఏం మునుగుతుంది అని తేలిగ్గా అనేస్తారు....అంతే గాని నా బాధ వాళ్ళకెలా అర్థం అవుతుంది చెప్పండి."

ప్చ్ ! యివాళ లేచినరోజు మంచిదికాదు కష్టపడి కూడబెట్టిన డబ్బు పోయింది !....సంవత్సరంనించి ఎదురు చూసిన ఈ రోజు యిలా అయి పోతుందని ఎన్నడూ అనుకోలేదు....ఎవరికి దొరికిందో ఆ సొమ్ము !.... నా ఆనందాన్ని, నా ఆశలని కాల్చిన ఆ మహానుభావుడు ఎవరో !....

గతుక్కుమన్నాడు శర్మ. బెదురుగా చూశాడు, సుబ్బారావు వంక. అప్రయత్నంగా జేబు గట్టిగా పట్టుకున్నాడు వణుకుతున్న చేతితో:

"మాష్టారూ. ఆ డబ్బు మీకైనా దొరికివుంటే ఎంత బాగుండేది ? మీరొక్క పావుగంట ముందు వచ్చివుంటే ఆ డబ్బు మీకు దొరికితే యిచ్చేసి వుండేవారుగదా !... హు....నా అదృష్టం యిలా వుంటే అలా ఎందుకు జరుగుతుంది. నిట్టూర్చి అన్నాడు సుబ్బారావు. శర్మ... చలించి పోయాడు అతను తనమీద వుంచిన నమ్మకానికి, ఏదో సంఘర్షణ బయలు దేరింది శర్మలో. అంతరాత్మ ఎదురుతిరిగింది. స్వార్థం పడగెత్తి అంత రాత్మని అణిచేసింది. ఎటూ తేల్చుకోలేక ఒక్క క్షణం నలిగి పోయాడు, స్వార్థం, మానవత్వాల మధ్య శర్మ.

"వస్తాను మేష్టారూ....యిలా విచారిస్తూ కూర్చుంటే పోయినడబ్బు దొరుకుతుందా ? ఈరోజు అలాంటిది !....ఇంటికెళ్ళి ఈ శుభవార్త విని పించాలి...." ఓ శుష్కహాసంచేసి లేచాడు బయలుదేర డానికి సుబ్బారావు.

అతని మొహంలోని నిరాశ, దీనత్వంచూసి యింక ఆగలేక

పోయాడు శర్మ...."మీ నోటు నెంబరు చూశారా?....పోలీసులకి రిపోర్టు యిస్తే దొరుకుతుందేమో....సందేహ నివృత్తికోసం అడిగాడు.

"నెంబరు ఎవరు చూస్తారండి....అంతదూరం ఆలోచన ఎవరికి వెడుతుంది?....పబ్లిక్‌చోట పారేసుకున్న దానికి పోలీసులు ఏం చేస్తారు? అనవసరమైన గొడవలు తప్ప....

తేలిగ్గా నిట్టూర్చాడు శర్మ. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఆలోచిస్తున్న శర్మ సుబ్బారావు బయలుదేరడం చూడనేలేదు. "వస్తాను మేష్టారూ! ఇంతసేపు సానుభూతిగా నా గొడవ విన్నందుకు చాలా థేంక్స్!" పేలవంగా నవ్వాడు సుబ్బారావు.

"చూడండి .... యిదుగో .... యిలా రండి .... ఒక మాట!" కాస్త గాభరాగా పిల్చాడు. శర్మ.

"చూడండి....మీరు డబ్బు పారేసుకుని ఎంతో బాధ పడుతున్నారు. మీ అన్యోన్య దాంపత్యం గురించి వింటూంటే నాకు చాలా సంతోషంగా వుంది. నా దగ్గిర ప్రస్తుతం డబ్బు వుంది, అది తీసికెళ్ళి మీ అవసరం గడుపుకోండి .. యిదిగో ఈ డబ్బు తీసికెళ్ళి చీరకొనండి" నోరు పెగల్చుకుని అన్నాడు శర్మ. జేబులోంచి నోటుతీసి పట్టుకుని.

సుబ్బారావు ఆశ్చర్యంగా చూశాడు. నమ్మలేనట్టు అనుమానంగా చూసి దగ్గిరికి వచ్చాడు. "మీరిస్తారా డబ్బు!"

"అవును ....నేనూ ఓ జరూరు పనికోసం వుంచాను ఈ డబ్బు .. కానీ .... మీ ఆనందానికి ఆటంకంగా మీరు డబ్బు పారేసుకోడం వింటే నా కేమిటో అనిపించింది. యిది తీసికెళ్ళి చీర కొనండి!" సుబ్బారావు చేతిలో నోటుపెట్టి ఏదో బరువు దింపుకున్నట్లు తేలిగ్గా ఊపిరితీసుకున్నాడు శర్మ.

"అప్పుగా యిస్తున్నారా....మళ్ళీ ఎప్పటికి తీర్చగలనో!" సందేహిస్తూ అన్నాడు సుబ్బారావు.

"అప్పుకాదు, ఊరికే యిస్తున్నాను తీసుకోండి!"

సుబ్బారావు విస్తుపోయి చూశాడు. "అదేమిటి ఊరికే యీయడం ఏమిటి!"

"అదంతే లెండి.... యిందులో నా ఉదారత ఏమీలేదు, భగవంతుడు నా కిచ్చింది మీ కిస్తున్నాను అంతే! యిందులో నా గొప్పతనం ఏమీలేదు. తీసుకోండి, చీరకొని ఆనందంగా గడపండి!" నల్లబడిన మొఖం తిప్పుకుని గబగబ వెళ్ళిపోతున్న శర్మని బిత్తరపోతూ చూశాడు సుబ్బారావు.

"అదేమిటి .... దానం యిస్తారా అంత డబ్బు! మీ ఎడ్రసు అయినా చెప్పండి, వీలయినప్పుడల్లా కాస్త కాస్త తీరుస్తాను!" వెంటబడుతూ అన్నాడు సుబ్బారావు

"వద్దు.... వద్దు.... తిరిగి తీసుకోడానికి యీయలేదు. ఆ డబ్బింక మీదే! ఈ విషయం మరిచిపోండి యింక "

దూరంగా చీకటిలో కలిసిపోయిన శర్మని చూస్తూ, నోటు చేతిలో పట్టుకుని సిగ్గుతో నల్లబడిన మొఖంతో నిలబడి పోయాడు సుబ్బారావు.

★